క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 17 నుంచి పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మే 10న జరగనున్న పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షకు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో గానీ, 9989160103, 9494931219 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అర్థమయ్యేలా బోధించండి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

యల్లనూరు: సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో బోధించాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పదో తరగతి పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్ల విధులు, విధానాలను వివరించారు. విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం వండిపెట్టాలన్నారు.

అండర్ డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

తాడిపత్రి టౌన్ : అండర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, కాలనీ వాసులు కోరారు. ఈమేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం వారు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అండర్ డ్రైనేజీ సమస్యతో మురుగునీరు వీధుల్లోకి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. బీజేపీ నాయకులు కృష్ణమోహన్, శివ, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై గ్రామసభలు

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల, కుమ్మనమల, చెర్లోపల్లి, కడవకల్లు తదితర గ్రామాల్లో శనివారం నార్పల ఉద్యాన శాఖ అధికారి ఫజులున్నీషా బేగం రైతులతో సమావేశం నిర్వహించారు. వర్షం వల్ల దెబ్బతిన్న పండ్లతోటల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతు పేరును జాబితాలో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు



కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, సిబ్బంది

గుత్తి: గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న గంగిరెడ్డిని ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు. దీంతో గుత్తిలో ఏఈగా పని చేస్తున్న శరత్ చంద్రను ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఈ క్రమంలో గూడూరులో కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులను ఉన్నతాధికారులు గుత్తికి బదిలీ చేశారు. నూతన కమిషనర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నదాన భవనం నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నూతన అన్నదాన భవనం నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరశురాముడు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. పెన్నహోబిలం ఆలయ పీఠాధిపతి ద్వారకానాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

తల్లీబిడ్డ ఆరోగ్యమే లక్ష్యం



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ షాహీదా

గుంతకల్లు రూరల్: తల్లీబిడ్డ ఆరోగ్యమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం నాగసముద్రం సెక్టార్ పరిధిలోని అయ్యవారుపల్లి, కదిరిపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించి సరైన పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం




చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా తదితరులు , సభకు హాజరైన మహిళలు

● ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

గుత్తి: మహిళల సాధికారత కోసం మరోసారి జగనన్నను మళ్లీ చేసుకుందామని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ , మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. 2019 కు ముందు డ్వాక్రా మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తున్నారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళుతున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, జగనన్న తోడు, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా వసతి వంటి పథకాల ద్వారా వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారన్నారు. ఎపుడు ఎన్నికలు వచ్చినా మరోసారి సీఎంగా జగన్‌ను చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని ఆ పార్టీ పాడి యాత్ర అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 ఎమ్మెల్యే సీట్లు గెలవడం ఖాయమన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి వైస్ చైర్‌పర్సన్లు బిందె వరలక్ష్మి, పద్మలత సీఎం జగన్ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. తనంతరం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 5783 మంది సభ్యులకు రూ.5.57 కోట్లు , మండలంలో మొత్తం 6,902 మంది సభ్యులకు రూ. 7.20 కోట్లు విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదగా మహిళా సంఘాల సభ్యులు అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సుమారు 7 వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్‌యాదవ్, మధుసూదన్ రెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, మండల, పట్టణ సచివాలయ కన్వీనర్లు సుభాష్ రెడ్డి, రంగస్వామి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, కమిషనర్ శరత్ చంద్ర, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం




డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సభకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: మహిళలు ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శనివారం యల్లనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను వేములపల్లి సచివాలయ ఉద్యోగి స్నేహ సన్మానించారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా 590 స్వయం సహాయ సంఘాల్లోని 5731 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5.99 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు సగర్వంగా బతుకుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. సంక్షేమ పథకాలతో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మళ్లీ 2024లో సీఎం జగనన్నను చేసుకోవాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కనివిని ఎరుగని రీతిలో 3వేలకుపైగా అక్కచెల్లెమ్మలు సభకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, వైఎస్ ఎంపీపీ-2 రంగయ్య, జేసీయస్ కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, తిరుమలాపురం, వేములపల్లి, యల్లనూరు సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, పెద్ద ఓబుళమ్మ, సొసైటి అధ్యక్షులు కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు కిరణ్, తాడిపత్రి ఏరియా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఏపీఎం ముత్యాలప్ప, ఏఓ రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడు, సీనియర్ సహాయకుడు శంకర్, ఏసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు



సంక్షేమ లబ్ధిని తెలిపే బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కేవీఎస్ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు కాలనీవాసులు టపాసులు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆమె కాలనీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు డ్రైనేజీ, ఇంటి పట్టాలు, విద్యుత్ సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలకు చెప్పుకునేందుకు ఒక్క పథకం అయినా ప్రవేశ పెట్టారా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో కార్యకర్తలతో పాటు నాయకులు ప్రజాధనాన్ని దోచుకునేందుకే సమయం వెచ్చించారన్నారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలన్నీ నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. కరోనాతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభంలో ఉన్నా జగనన్న ప్రజలకు చెప్పిన సమయానికి పథకాలు అందించారన్నారు. దేశ చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి, యువనేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ వరలక్ష్మి, పూల నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, ముసలన్న, కొండమ్మ, చికెన్ నారాయణస్వామి, అనంత వెంకటరెడ్డి, చేపల రమణ, చంద్రమోహన్, శేషానందరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, పూల రంగా, కాటమయ్య, సూరి, హరి, అంజి, వడ్డే లక్ష్మినారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

నార్పల: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి డ్వాక్రా మహిళలకు ఉదయం 10 గంటలకు మెగా చెక్కు అందిస్తారని తెలిపారు. అనంతరం .అనంతరం సచివాలయ-2 భవనం,మసీదుకట్ట వంతెన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



వరాహ రూపంలో శ్రీరాముడు

తాడిపత్రి టౌన్: స్థానిక ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి శ్రీరామ చంద్రుడు వరాహ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

గార్లదిన్నె: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ బుక్కరాయసముద్రంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం నుంచి ఆదినారాయణ బదిలీపై రానున్నారు.

భూముల రీ సర్వే ప్రయోజనకరం



లబ్ధిదారుడికి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన భూముల రీసర్వేతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం ఆయన పులిప్రొద్దుటూరులో లబ్దిదారులకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో భూ సమస్యలు రాకుండా ప్రభుత్వం రీసర్వే చేపడుతోందన్నారు. రీ సర్వే అనంతరం ఆయా భూముల యజమానులకు శాశ్వత భూహక్కు, భూ రక్ష కింద పత్రాన్ని అందజేస్తోందన్నారు. ఇందులో భాగంగా పులిప్రొద్దుటూరులో భూ రీసర్వే పూర్తయిందని, దాదాపు 300 మంది వరకు పత్రాలు మంజూరయ్యాయన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. రీసర్వేతో అత్యాధునిక పరికరాలను ఉపయోగించి, పక్కాగా ఆయా సర్వే నంబర్లలోని విస్తీర్ణం, హద్దులు నిర్ణయించారన్నారు. భూ, స్థలాలకు సంబంధించిన పత్రాలు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అలాంటి నాయకుడిని మనం వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, సర్పంచ్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రాజారెడ్డి, వెంకటరంగారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

పామిడి: మండలంలోని రామగిరి సచివాలయం, యూపీ స్కూల్‌ను శనివారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆయన సచివాలయానికి వెళ్లి రికార్డులు, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. అంకితభావంతో విధులను నిర్వర్తించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. స్పందన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం గ్రామంలోని యూపీ స్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

దర్గా కట్ట సమస్య పరిష్కరించండి



తహసీల్దార్ మహబూబ్‌బాషాతో చర్చిస్తున్న డీఎస్పీ, సీఐలు

గుత్తి రూరల్: పట్టణంలోని పాత సీపీఐ కాలనీలో మహబూబ్ సుభహాని దర్గా కట్ట సమస్యకు పరిష్కారం చూపాలని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తహసీల్దార్ మహబూబ్‌బాషాకు సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో డీఎస్పీ నరసింగప్ప, గుత్తి, పామిడి సీఐలు వెంకటరామిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి తహసీల్దార్‌తో సమావేశం నిర్వహించారు. దర్గా కట్టకు సంబంధించి స్థలం తమదంటే తమదని ఇరు వర్గాల మధ్య వివాదం జరుగుతోందని, ప్రభుత్వ రికార్డుల ప్రకారం సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశాలున్నాయని రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఇరువర్గాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పామిడి ఎస్ఐ చాంద్‌బాషా, డీటీ శ్రీలత, వీఆర్‌ఓ రంగయ్య పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



శ్రీసుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం

తాడిపత్రి టౌన్: పట్టణంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. పట్టణంలోని 10 పరీక్ష కేంద్రాల్లో 2,686 మంది రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. టైలర్ కాలనీలోని మున్సిపల్ ప్రకాశం ఉన్నత పాఠశాలలో 260 మంది, శ్రీనివాసపురం శ్రీ సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 260 మంది, మెయిన్‌బజార్‌లోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 220 మంది, సుంకులమ్మపాలెంలోని చర్చి స్కూలులో 200 మంది, సంజీవనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది, సంజీవనగర్‌లోని సాయివిజేత స్కూలులో 309 మంది, కాల్వగడ్డ వీధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో 300 మంది, బుక్కపట్నం వీధిలోని నారాయణ స్కూలులో 307 మంది, యల్లనూరు రోడ్డు శ్రీవాణి స్కూలులో 299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వివరించారు.

యాడికి: మండలవ్యాప్తంగా 944 మంది విద్యార్థులు మార్చి 3 నుంచి 18వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ కాశెప్ప శనివారం ఓ ప్రటకనలో తెలిపారు. యాడికి ఉన్నత పాఠశాలలోని ఏ సెంటర్‌లో 250 మంది బి సెంటర్‌లో 245 మంది, వాగ్దేవి పాఠశాలలో 250, ప్యారడైజ్ పాఠశాలలో 199 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కాశెప్ప పేర్కొన్నారు.

శింగనమల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. మొత్తం 413 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

గార్లదిన్నె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు. మొత్తం 842 మంది పరీక్షలు రాస్తారన్నారు.


ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని చిన్నవిఠోబస్వామి ఆలయంలో రంగసుభేఫిర్కా ఆధ్వర్యంలో శనివారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విఠోబస్వామిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తి కీర్తనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం గావించారు.

చలివేంద్రం ప్రారంభం

గుంతకల్లుటౌన్: సీఐటీయూ లగేజీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం టూటౌన్ సీఐ గణేష్ ప్రారంభించారు. ఆటోడ్రైవర్లసేవాభావాన్ని సీఐ అభినందించారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, యూనిఫామ్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు డి.శ్రీనివాసులు, నాగరాజు, లోకేష్, సుంకన్న, ధనూ, ఆనంద్, భరత్, రామాంజి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గేట్స్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం కళాశాల 22వ వార్షికోవాన్ని ఘనంగా నిర్వహించారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ శాంతి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, కాంగ్రెస్ సీనియర్ నేత కార్పెంటర్ వలి, హెచ్ఓడీలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గేట్స్ ఎండీ, కరస్పాండెంట్లు గేట్స్ కాలేజీ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన మ్యూజిక్ ట్రూప్ పాటలతో అలరించారు. గేట్స్ కాలేజీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షల్లో టాపర్లను వారి పేరెంట్స్‌తో కలిపి సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆస్తి, నీటి పన్నుల ద్వారా రూ.13.02 కోట్లు

గుంతకల్లుటౌన్: ఆస్తి, నీటి పన్నుల వసూలు ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ గుంతకల్లు మున్సిపాల్టీకి రూ.13.02 కోట్ల ఆదాయం లభించింది. మొత్తం ఆస్తి పన్నుల డిమాండ్ రూ.13 కోట్లు కాగా అందులో ఇప్పటివరకు రూ.10.02 కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి నాసిర్‌హుసేన్ తెలిపారు. ఇక నీటి పన్ను డిమాండ్ ప్రకారం రూ.6 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.3 కోట్లు వసూలైనట్లు ఆర్ఓ వెల్లడించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేయడంతో ఆస్తిపన్ను చెల్లింపులు అనూహ్యంగా పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. మిగిలిన దాదాపు రూ.2.80 కోట్ల దాకా కాయలాపడ్డ పరిశ్రమలు(ఏసీఎస్.మిల్లు, స్లీపర్‌ఫ్యాక్టరీ)తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా మొండి బకాయిలు వసూలుకై సంబంధిత ఉన్నతాధికారులకు లేఖలు పంపామన్నారు.

ముందస్తు పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేటు

మున్సిపాల్టీ పరిధిలో ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుదారులు మొత్తం పన్నులో 5 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు ఆర్ఓ తెలియజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ నెల 30లోపు చెల్లించే వారికి మాత్రమే రిబేటు వర్తిస్తుందని ఆయన చెప్పారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లు రూరల్: త్రైత సిద్ధాంతం నాగసముద్రం కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రైతశకం -45 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం తదితర ప్రాంతాల్లో కమిటీ సభ్యులు నూతన క్యాలెండర్‌ను ఉపాధ్యాయులకు, ఉగ్యోగులకు పంపిణీ చేశారు. నాగసముద్రం కమిటీ అధ్యక్షుడు ప్రకాష్, సభ్యులు ధనుంజయ, రాజశేఖర్, చిన్న ఓబులేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ చెందిన కుళ్లాయప్ప, విజయనగర్‌కాలనీకి చెందిన షెక్షావలి, తాడిపత్రి మండలం గంగాదేవి పల్లికి చెందిన సారెడ్డి నరసింహారెడ్డిని అరెస్ట్ చేసి మూడు ట్రాక్టర్లు, 13 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు.